క్లుప్తంగా

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: గ్రామంలోని పాస్టర్ రాబర్ట్ చిన్నమంద మందిరంలో సోమవారం కడియం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ జీవరత్నం అధ్యక్షత వహించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్, రీజినల్ చైర్మన్ డి.వరంజ్యోతి, రీజినల్ జాయింట్ సెక్రటరీ జయశీల్ ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ ప్రతాప్‌సిన్హా కొమానపల్లి వాక్యసందేశాన్నందించారు. సమావేశంలో ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఆమరణ దీక్ష

ప్రకాశం నగర్: గోవధ నిషేధం, హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం ఈ నెల 10న మాతృరూపణి సేవా సంస్థ మందిరంలో ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు అజ్జరపు హరిబాబు తెలిపారు. ఆ సంస్థ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవధ నిషేధం, హిందూ దేవాలయాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వానికి ఎన్నో వినతులు ఇచ్చినా, ఎక్కడా స్పందన కనిపించడం లేదన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తు ఈ నెల 9 వరకూ రిలే నిరాహార దీక్షలు జరుపుతామన్నారు. ఈ లోపు ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వని పక్షంలో 10న ఆమరణ నిరాహార దీక్షకు చేపడతామన్నారు. సమావేశంలో నగర బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు దుర్వాసుల సత్యనారాయణ, దేశిరెడ్డి బలరామ నాయుడు, మాతృరూపణి సేవా సంస్థ నిర్వాహకులు భాస్కర్ రెడ్డి, నిడమర్తి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సెలూన్ ప్రారంభం



పోలీస్ సెలూన్‌లో ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీస్ సెలూన్ సోమవారం ఎస్పీ డి.నరసింహ కిశోర్ ప్రారంభించారు. జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా వారి అవసరాలకు ఉపయోగపడే విధంగా దీన్ని తీర్చిదిద్దారు. పోలీసు సిబ్బంది ఇక్కడి సేవలను ఉచితంగా వినియోగించుకోవచ్చు.

పంటల బీమా చేయించుకోవాలి

కడియం: ప్రతి రైతూ పంటల బీమాను చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పెందుర్తి పద్మలత కోరారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటకు ఏమైనా ఇబ్బందులు కలిగితే నష్టపరిహారం లభించాలంటే బీమా చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సచివాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి–1 ఏఆర్‌కే తులసీదాస్ అన్నారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం మండలంలో మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన నిర్వహించే పేరెంట్ టీచర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులను భాగస్వాములు చేయాలన్నారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి–2 బి.కిరణ్ చందుకుమార్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: తమ్ముడు
సూర్యమినీ	: 3 బీహెచ్‌కే
సూర్యప్యాలెస్	: జురాసిక్ వరల్డ్
స్వామి	: కుబేర
అనుశ్రీ	: జురాసిక్ వరల్డ్
శివజ్యోతి	: తమ్ముడు
రాజా	: తమ్ముడు
ఊర్వశి	: జురాసిక్ వరల్డ్
మేనక	: షోటైమ్
రంభ	: మార్గన్
అప్సర	: తమ్ముడు
అశోక	: కన్నప్ప
నామవరం	
వీఎస్ మహల్	: తమ్ముడు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: తమ్ముడు
కడియం	
వెంకటసూర్య	: తమ్ముడు

దొరికినంత దోచెయ్..

- ఎక్స్ సర్వీస్‌మెన్ భూముల్లో గ్రావెల్ దోపిడీ
- కూటమి నేతల కనుసన్నల్లో వ్యవహారం
- పట్టించుకోని అధికారులు



ఎక్స్ సర్వీస్‌మెన్ భూముల్లో అక్రమ తవ్వకాలు సాగించిన ప్రాంతం

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్య నగర్‌ను ఆనుకుని ఉన్న ఎక్స్ సర్వీస్‌మెన్ భూముల్లో గ్రావెల్‌ను అక్రమార్కులు తవ్వేసి సొమ్ములు చేసుకుంటున్నారు. రాత్రింబవళ్లూ యథేచ్ఛగా సాగుతున్న ఈ దోపిడీని మైన్స్, రెవెన్యూ యంత్రాంగం చూసిచూడనట్లు ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. కడియం, రాజానగరం, మండపేట రూరల్ మండలాలకు సరిహద్దుల్లో జనావాసాలకు దూరంగా ఉండే ఈ భూముల్లో అక్రమ తవ్వకాలు నిత్యం జరుగుతున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా జరుగుతున్న ఈ గ్రావెల్ దోపిడీకి కనీసం ఏ శాఖ అధికారులు గానీ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు గానీ అడ్డు చెప్పక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిత్యం వందల భారీ వాహనాలు వేగంగా తిరుగుతుండడంతో ఈ ప్రాంతానికి సమీపంలోని చైతన్యనగర్ వాసులు ఆందోళనతో ఎప్పుడైనా రోడ్డెక్కితే మాత్రమే ఈ దోపిడీ వ్యవహారం వెలుగు చూస్తోంది. అక్కడి స్థానికులు పలుమార్లు రెవెన్యూ, మైన్స్ యంత్రాంగం దృష్టికి ఈ అక్రమ తవ్వకాల అంశం తీసుకువెళ్లినప్పటికీ అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి సంబంధిత శాఖల అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

కూటమి నాయకుడి స్కెచ్

రూరల్ నియోజకవర్గంలో ముఖ్యనేతకు కుడిభుజంగా చెప్పుకునే వ్యక్తే ఈ గ్రావెల్‌ను 'వాసి'గా దోచేస్తున్నారంటున్నారు. అక్రమ తవ్వకాలకు పాల్పడే వ్యక్తులు బహిరంగంగానే సదరు నాయకుడికే చెందిన భూములను మెరక చేయడానికే గ్రావెల్‌ను తరలిస్తున్నట్లుగా చెప్పడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. రూరల్ మండలానికి చెందిన సదరు నాయకుడు ఈ దోపిడీకి స్కెచ్ వేసినట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఈ కారణంగానే రెవెన్యూ, మైన్స్ యంత్రాంగం అటువైపు చూడడం లేదంటున్నారు. ఒక వేళ పదేపదే వారి దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ అక్రమార్కులపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవలే అక్రమ తవ్వకాలు జరుగుతున్న విషయాన్ని మైన్స్ అధికారులకు స్థానికులు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. అయితే అక్కడకు వచ్చిన మైన్స్ అధికారులు తవ్వకాలకు వినియోగిస్తున్న యంత్రాలను సీజ్ చేయకుండా వదిలిపెట్టారంటున్నారు.

లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇస్తేనే..

అక్రమ తవ్వకాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తాము చర్యలు తీసుకుంటామని రెవెన్యూ యంత్రాంగం చెబుతున్నట్లుగా తెలుస్తోంది. కళ్లెదుటే అక్రమ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ, తమకు లిఖిత పూర్వక ఫిర్యాదులు అందలేదన్న సాకుతో అక్రమ తవ్వకాలను ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసమో రెవెన్యూ సిబ్బందికే తెలియాలి.

అనుమతులు లేవు

ప్రస్తుతం చైతన్యనగర్ సమీపంలోని సర్వే నంబర్ 9లో ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఈ తవ్వకాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవంటున్నారు. స్థానిక రెవెన్యూ యంత్రాంగం సరైన సమాధానం కూడా చెప్పడం లేదంటే కూటమి నాయకులు చేసే అక్రమాలకు సిబ్బంది ఏ స్థాయిలో మద్దతుగా నిలుస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

పదో తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ



ప్రశాంతి, కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ పరిధిలో వీధి విక్రయదారుల నూతన గుర్తింపు కార్డుల దరఖాస్తులను ఈనెల 10 తేదీ వరకూ స్వీకరిస్తామని, ఆలోపు అర్హులందరూ దరఖాస్తు చేస్తుకోవాలని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. ఆమె సోమవారం మాట్లాడుతూ వీధి వ్యాపారుల సంక్షేమానికి నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని, గత నెల రోజులుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. వారందరికీ త్వరలోనే గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆర్ఎంసీ నూతనంగా ఇచ్చే కార్డులే ప్రామాణికమని, కాబట్టి నగరంలోని ప్రతి వీధి వ్యాపారి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీని కోసం వ్యక్తిగత ఫొటో (వ్యాపారం చేస్తున్న వ్యక్తి పాస్‌పోర్ట్ ఫొటో), డిక్లరేషన్ పత్రం, నివాసపత్ర ఆధారం, గతంలో స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డు నకలు, నగరపాలక సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డు నకలు, ఆధార్ కార్డు, అర్జీదారుని ఫోన్ నెంబర్, బ్యాంకు అకౌంట్ నకలు తదితర గుర్తింపు పత్రాలతో అర్జీలను సమర్పించాలన్నారు. వాటిని స్క్రూటినీ చేసిన తర్వాత, శాశ్వత గుర్తింపు కార్డులను వీలైనంత త్వరలో మంజూరు చేస్తామన్నారు. వీటి ఆధారంగా జోన్ల కేటాయింపు చేపడతామన్నారు. కనుక ప్రతి తోపుడు బండి వ్యాపారి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే 79016 10072 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలి

కంబాలచెరువు: అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని సమష్టి కృషితో, అందరి సమన్వయంతో ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సూచనలను విధిగా పాటించాలన్నారు. మెగా పీటీఎం 2.0 గిన్నిస్ రికార్డులో నమోదు చేయబడే కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో అర్బన్ పరిధిలోని 8 స్కూల్ కాంప్లెక్స్‌ల చైర్మన్లు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కోటేశ్వరి, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు



హుకుంపేటలో యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్న డాక్టర్ రవి వర్మ, చిత్రంలో తమ్మా రవి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని కడియం ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు ఏ.రవివర్మ సూచించారు. జునోసిస్‌డే సందర్భంగా సోమవారం హుకుంపేట రామకృష్ణ నగర్ సచివాలయం వద్ద పశుసంవర్థక శాఖ, సత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ముందుగా కార్యక్రమాన్ని ఏడీ రవివర్మ, పశుసంవర్థకశాఖ సంక్షేమ సభ్యులు, సత్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తమ్మా రవి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.వెంకటరావు, పశువైద్యులు ఏవీ ప్రసన్న కుమార్, జె. శ్రీరామ్ రవికిరణ్, ఏఎంసీ డైరెక్టర్ ఎం.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'సత్యసాయి' కార్మికుల సమ్మె

రాజమహేంద్రవరం రూరల్: సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్టులో పనిచేసే 52 మంది కార్మికులకు 19 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నారు. ఈ సమస్యపై గతంలో లాలాచెరువులోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆఫీసు వద్ద కార్మికులు సమ్మె చేయగా అధికారులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదు. బకాయి జీతాలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐలకు సైతం సొమ్ములు చెల్లించకపోవడంతో సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లై పురుషోత్తపట్నం స్కీం కార్మికులు సమ్మె బాటపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెపై ముందుగానే అధికారులకు, కాంట్రాక్టర్లకు పోస్టల్ ద్వారా నోటీసు పంపించామన్నారు. కానీ ఎవ్వరూ స్పందించకపోవడంతో సమ్మెలోకి వెళుతున్నట్టు చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మె మొదలవుతుందని, మొదటి రోజు గోకవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి లాలాచెరువులోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజి నీరు కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తామన్నారు. తమ జీతాలు సమస్య పరిష్కారమయ్యే వరకూ సమ్మెను కొనసాగిస్తామన్నారు.

అలయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ: పేదలు ఏదైనా సహాయం కావాలంటే తమను సంప్రదించాలని అలయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వి.రవికుమార్, సెక్రటరీ ఎస్.శేషుబాబు, కోశాధికారి జి.గిరీష్ కుమార్ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం 2025– 26కు సంబంధించి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. దీనిలో భాగంగా మార్కండేయేశ్వర స్వామి ఆలయం సమీపంలోని లయన్స్ క్లబ్‌లో నూతన కార్యవర్గం సమావేశం జరిగింది. కార్యక్రమంలో పెంకె గోవిందరాజు, కె.బుచ్చిరాం, కె.కుమారి, కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగుతో అదనపు ఆదాయం



రైతులకు మినీకిట్లును అందజేస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: అపరాల పంటలతో అదనపు ఆదాయం పొందవచ్చని రాజమహేంద్రవరం వ్యవసాయ సహాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం సబ్ డివిజన్‌లోని రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం మండలాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సోమవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం వద్ద కందులు, మినుము. జొన్నల మినీకిట్లు అందజేశారు. కార్యక్రమంలో పీఏటు సహాయ సంచాలకులు కె.సూర్యరమేష్, అర్బన్ వ్యవసాయ విస్తరణాధికారి డి.వేణుమాధవరావు పాల్గొన్నారు.

రూ.7 వేల కోట్ల టర్నోవర్‌తో మెరుగైన సేవలు



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రామస్వామి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) రూ.7 వేల కోట్ల టర్నోవర్‌తో, రూ.15 వేల కోట్ల డిపాజిట్లతో ఉమ్మడి జిల్లాలో మెరుగైన సేవలు అందిస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. స్థానిక రామదాసు సహకార శిక్షణ కేంద్రంలో డీసీఎం అండ్ సీఏ పదో బ్యాచ్ శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం 9వ బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసి, ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ ఎం.జగన్నాథ రెడ్డి, డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ ఎం.కనకదుర్గారెడ్డి, కోర్స్ కో ఆర్డినేటర్ ఆదిమూలం వెంకటేశ్వరరావు, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్న శేషుమాధవ్, మాధవరావు, వీఎస్‌జీఆర్ నాయుడు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పంటల్లో సమగ్ర పోషకాల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సును సహకార సంఘ సీఈవోలు, ఎరువుల డీలర్లు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. స్థానిక జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ కార్యాలయంలో కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాకు చెందిన సహకార సంఘాల సీఈవోలు,ఎరువుల డీలర్లుకు సోమవారం సర్టిఫికెట్ కోర్సు మొదలైంది. దీన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషుమాధవ్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల అభ్యాసాలను కేవలం వినడమే కాకుండా, సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఎరువుల డీలర్లు, సహకార సంఘాల సీఈవోలకు సూచించారు.

80 శాతం హాజరు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ సహకార సంఘాల సీఈవోలు ఎరువుల దుకాణాలను నడిపేటప్పుడు వ్యాపారంతో పాటు సమాజసేవను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. సర్టిఫికెట్ కోర్సును సద్వినియోగం చేసుకుంటే ఆపద సమయంలో అర్హత ఉన్న ఎరువుల డీలర్లకు వ్యవసాయశాఖలో ఉపాధి అవకాశం ఉంటుందన్నారు. 15 రోజుల కోర్సులో సర్టిఫికెట్ పొందాలంటే 80 శాతం హాజరు తప్పనిసరి అన్నారు. ఈ కోర్సు సమయంలో కేవలం గదిలో బోధనలే కాకుండా భూసార కేంద్రాలకు, ఆదర్శ రైతు క్షేత్రాలకు, సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలకు ప్రదర్శనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.అరుణ్ కుమార్, కేవీకే అధికారులు డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, రఘునందన్, డాక్టర్ అజ్మల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట, పిడింగొయ్యి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని రూరల్ ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్‌ను బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు బీజేపీ రెండవ మండల అధ్యక్షుడు మట్ట నాగబాబు, అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, జిల్లా కార్యదర్శి తనుబుద్ది సూర్యభాస్కరరావు, సింగవరపు రామకృష్ణ, ముంగంటి సూర్యనారాయణ వినతిపత్రం అందజేశారు. మండల స్థాయి పర్యటనలో భాగంగా హుకుంపేట, పిడింగొయ్యి గ్రామాల్లోని కొన్ని సమస్యలను గుర్తించామన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీ నీరంతా కోనేరుపేట ప్రాంతంలో ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. హుకుంపేట పంచాయతీ పరిధి శాంతిపురం– 2లో తాగునీరు ఇబ్బందులు ఉన్నాయని, తక్షణమే పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. వెంకటేశ్వర మార్కెట్ నుంచి వంద అడుగుల రోడ్డు వరకు నూతన రోడ్డు నిర్మించాలని కోరారు.

మొక్కలతో వాతావరణ సమతుల్యత

పెదపూడి: వాతావరణంలో సమతుల్యత సాధించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జి.మామిడాడ లయన్స్ క్లబ్ శ్రీ సూర్య అడ్మిన్ మండ రాజారెడ్డి అన్నారు. క్లబ్ అధ్యక్షుడు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సోమవారం జి.మామిడాడలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రాజారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలన్నారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

వెయిట్ లిఫ్టింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు



విజేతకు బహుమతి అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వెయిట్ లిఫ్టింగ్‌తో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు, అమలాపురం పార్లమెంటు పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. స్థానిక గేదెల నూకరాజు కల్యాణ మండపంలో శ్రీరామ్ పవర్ జిమ్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2025–26 పోటీలను ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. మెన్, ఉమెన్ కేటగిరిలలో యూత్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. ఆదివారం రాత్రి విజేతలకు జక్కంపూడి విజయలక్ష్మి, టీడీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, కేశవభట్ల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కేశవభట్ల శ్రీనివాస్, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామయ్య, ఇంటర్నేషనల్ కోచ్ అమరనాథ్, దీన్నాబాబు, జిల్లా అధ్యక్షుడు యాళ్ల భాస్కరరావు, అసోసియేషన్ నేతలు సతీష్ కుమార్, రామకృష్ణ, టీవీవీ రామారావు చేతుల మీదుగా బహుమతులు, పతకాలు అందించారు.